క్లుప్తంగా

ఫిజియోథెరపీతో ఉత్తమ ఫలితాలు



సి.బెళగల్‌లో ఫిజియోథెరపీ చేస్తున్న వీరేష్

సి.బెళగల్: దివ్యాంగ పిల్లలకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని ఫిజియోథెరిపిస్ట్ వీరేష్ అన్నారు. స్థానిక భవితా కేంద్రంలో 10 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపి చేశారు. వ్యాయామం చేయించారు. ప్రతి సోమవారం దివ్యాంగులకు నిర్వహించే ఉచిత ఫిజియోథెరపి క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొవాలని కోరారు.

ఆర్బీకే నిర్మాణాలను వేగవంతం చేయాలి



బ్రాహ్మణదొడ్డిలో పనులను పరిశీలిస్తున్న ఏఓ

సి.బెళగల్: మండల వ్యాప్తంగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఆర్బీకే భవన నిర్మాణాలను వేగతంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి పనులను పరిశీలించారు. బ్రాహ్మణదొడ్డి గ్రామంలో చివరి దశకు చేరుకున్న ఆర్బీకేను పరిశీలించి త్వరితగతిన రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అదే విధంగా ఇనగండ్ల గ్రామంలోని భవనాన్ని పరిశీలించి పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. వ్యసాయ సహాయకులు చెంచురాజు, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

సి.బెళగల్ ఎస్ఐగా తిమ్మారెడ్డి



సి.బెళగల్: మండల ఎస్ఐగా తిమ్మారెడ్డి నియమితులైనట్లు కోడుమూరు సీఐ మనుసూరుద్దీన్ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న మన్మథ్‌విజయ్ కర్నూల్ త్రీటౌన్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో గోనెగండ్ల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న తిమ్మారెడ్డిని సి.బెళగల్ స్టేషన్‌కు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని సీఐ వెల్లడించారు. ఎస్ఐ తిమ్మారెడ్డి మూడు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కోడుమూరు సీఐ

కోడుమూరు రూరల్: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ సూచించారు. సోమవారం కోడుమూరులోని స్నేహవినాయక కల్యాణ మండపంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై మండల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపరాదని, చూపితే చట్టాల ద్వారా ఎస్సీ, ఎస్టీలు న్యాయం పొందవచ్చన్నారు. విద్యతోనే వివక్ష దూరం అవుతుందని తెలిపారు. సీఐడీ సీఐ దస్తగిరి ఎస్సీ, ఎస్టీల రక్షణ కోసం ఉన్న చట్టాలను వివరించారు. చట్టాలను దుర్వినియోగం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ప్రజా సంఘాల నాయకులు క్రిష్ణ, మునిస్వామి, నాగేష్, రంగస్వామి పాల్గొన్నారు.

భూసమస్యలపై వినతి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు


సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు అర్జీలు ఇచ్చా రు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. గుండ్రేవుల, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, సి.బెళగల్ గ్రామాలకు చెందిన రైతులు భూ రీసర్వేలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని ఆయన్ను కోరారు. అలాగే పలు గ్రామాల్లో డ్రైనేజ్, రోడ్డు సమస్యలపై విన్నవించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సందీప్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా, హౌసింగ్ ఏఈ సుమంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

తాగునీటిపై అపోహలొద్దు

కర్నూలు (టౌన్) : సరఫరా చేస్తున్న మంచినీటిపై ఎలాంటి అపోహలు పడొద్ద ని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో రెండు రోజుల క్రితం ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల సహకారంతో ఆ యువకుడి మృత దేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం 1200 డయా పైప్‌లైన్‌ను సూపర్ క్లోరినేషన్ ద్వారా శుభ్రపరచడమే గాక నీటి నాణ్యతను ప్రయోగాలలో పరిశీలించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

పేదల ఆరోగ్యం పదిలం

- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ వైద్య కార్యక్రమాలు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్య సేవలు
- జగనన్న ఆరోగ్య సురక్షతో వందలాది మందికి వైద్య పరీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు





చిందుకూరులో ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్న డాక్టర్



కొర్రపోలూరులో సురక్ష క్యాంపులో ఈసీజీ తీస్తున్న వైద్య సిబ్బంది

గడివేముల: ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న పథకాలను ప్రవేశ పెడుతోంది. అనుక్షణ అప్రమత్తంగా ఉంటూ.. సకాలంలో వ్యాధులను గుర్తించి, అవసరమైన వైద్యం పొందేలా వైద్య సిబ్బందిని ఇంటింటికీ పంపుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలు ప్రవేశపెట్టి ప్రజల చెంతకే వైద్యులను తీసుకెళ్తోంది. దీంతో తొలిదశలోనే వ్యాధుల నిర్ధారణ జరిగి, సకాలంలో వైద్య సేవలు పొందగలుగుతున్నారు. మరోవైపు ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు నియామకాలు పెద్ద ఎత్తున చేపట్టి వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చేసింది.

గ్రామీణ వైద్యం పటిష్టం

ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున మండలంలో 14 ఏర్పాటు చేశారు. వాటిలో బీఎస్సీ నర్సింగ్ చేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, ఆశ, హెల్త్ అసిస్టెంట్‌లు విధులు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్ వంటి పరీక్షలతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సత్వరమే వైద్య సేవలు అందించేలా, పాము కాటు, పాయిజన్‌కు గురైనప్పుడు సత్వరమే ఏమి చేయాలనే అంశాలపై కూడా వారికి శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాలను నాడు-నేడు ద్వారా అధునికీకరించారు. అత్యాధునిక లేబొరేటరీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

అసాంక్రమిక వ్యాధులపై దృష్టి..

ప్రస్తుతం జీవనశైలి వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. వాటిని తొలిదశలో గుర్తించి సకాలంలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇటీవల ఇంటింటి సర్వే చేసి, మధుమేహం, రక్తపోటు, హైపో థైరాయిడ్ వంటి వ్యాధులతో బాధపడే వారిని గుర్తించారు. వారికి సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. జీవనశైలి వ్యాధులున్న వారు కచ్చితంగా మందులు వాడేలా చూసేందుకు వారిని సమీపం లోని పీహెచ్సీలకు మ్యాపింగ్ చేశారు. వీరికి ప్రతి పదిహేను రోజులకోసారి నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పరీక్షలు చేసి మందులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే గుండె, కిడ్నీ, బ్రెయిన్ వ్యాధుల బారిన పడకుండా చూస్తున్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణులతో పాటు, పట్టణ ప్రాంత ప్రజలకు వరంలా మారింది. ప్రతిగ్రామ, వార్డు సచి వాలయం పరిధిలో స్పెషలిస్టు వైద్యులతో శిబిరం నిర్వహించి, అన్ని రకాల పరీక్షలతోపాటు, ఉచితంగా మందులు అందిస్తున్నారు. మొదటి విడతలో ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో రెండో విడతను ఈ ఏడాది ప్రభుత్వం ప్రారంభించింది.

గతంలో పట్టణాలకు పరుగులు..

గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నంద్యాల, కర్నూలు పట్టణాలకు పరుగు పెట్టేవారు. గర్భిణులు, బాలింతలు కూడా పరీక్షలు నిమిత్తం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. పేద ప్రజలు వైద్య చేయించుకో లేక, మందులు కొనలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వ వైద్య కార్యక్రమాల ద్వారా గ్రామాల్లోనే వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రతి నెలా 3,183 మందికి వైద్య సేవలు

మండలంలోని గ్రామాల్లో ప్రతి నెల 3,183 మందికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుతున్నాయి. మండలానికి ఒక 104 వైద్య సేవల వాహనం ఉండగా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఫ్యామిలీ డాక్టర్ పథకంతో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ప్రతి సచివాలయ పరిధిలో నెలకు రెండు సార్లు ఒక్కొక్క గ్రామానికి వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఈసీజీ, గర్భిణులకు హార్ట్, రేట్ మానిటర్, హెచ్‌బీ వంటి 14 రకాల టెస్టులు, 90 రకాల మందులు ఇస్తున్నారు.

మా ఊళ్లోనే వైద్యం



గతంలో ఏదైనా జ్వరం వస్తే నంద్యాలకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు మా ఊర్లోనే విలేజ్ క్లినిక్ ద్వారా డాక్టర్లు వైద్యం చేస్తున్నారు. మందులు కూడా ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం పేదలకు వైద్యం అందించేందుకు ఎంతో కృషి చేస్తోంది. గడివేముల ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మా బాగోగులు చూసుకుంటున్నారు.

– జమాల్‌బీ, గడివేముల

గుండె పరీక్షలు ఉచితంగా చేశారు



మా గ్రామంలోనే జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో నాకు ఉచితంగా గుండె పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గత కొన్ని రోజుల నుంచి వివిధ సమస్యలతో బాధపడుతుండటంతో మా గ్రామానికి వచ్చిన వైద్యులకు చూపించగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గతంలో ఏ ప్రభుత్వం మా ఆరోగ్యం గురించి పట్టించుకోలేదు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– దస్తగిరి, గడివేముల

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి



మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను వందశాతం ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్షలతో పాటు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, ఇమ్యునైజేషన్ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. రెండో విడత జగనన్న సురక్ష క్యాంపులకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుంది.

– డాక్టర్ మొల్లా జబీన్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, గడివేముల

మార్కెట్‌లో ఈ-నామ్ సర్వర్‌కు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ-నామ్ సర్వర్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సర్వర్ పనిచేయకపోవడంతో సోమవారం వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు ఆలస్యంగా జరిగాయి. సాంకేతిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వేరుశనగ మినహా మిగిలిన వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు మ్యానువల్‌గా నిర్వహించారు. మరో రెండు రోజులు ఈ-నామ్ సర్వర్‌లో అంతరాయం ఉండే అవకాశం ఉందని మార్కెట్ కమిటీ వర్గాలు తెలిపాయి. కాగా కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో కందుల ధర మరింత జోరు మీద ఉంది. గరిష్టంగా రూ.10,200 ధర లభించడం విశేషం. వాముకు రూ. 22,210, ఎండు మిర్చికి రూ.21,589, మినుముకు రూ.8,929 ప్రకారం ధర లభించాయి.

రూలర్ ఫుట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు ప్రతిభ



ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టును అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్): ఈనెల 27 నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి రూలర్ పుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మొదటి స్థానం తెలంగాణ జట్టు, మూడో స్థానంలో జార్ఖండ్ జట్టు నిలిచాయి. వెండి పతకం, మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించిన హిమబిందు, హన్సిక, రిషిర, మధుమిత (బాలికల విభాగం) ధీరజ్, చేతన్ (బాలుర విభాగం) క్రీడాకారులను సోమ వారం స్పోర్ట్స్ అథారిటీకి చెందిన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తన చాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



డ్రైవర్లకు నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో ప్రసంగిస్తున్న ఎంవీఐ మనోహర్‌రెడ్డి

కర్నూలు: డ్రైవర్లు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మోటార్ వాహన తనిఖీల అధికారి డి.మనోహర్‌రెడ్డి సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవంలో భాగంగా సోమవారం కర్నూలు శివారులోని డోన్ జాతీయ రహదారి పక్కన మిస్టర్ ఇడ్లీ ఎదురుగా ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో లారీ, ఆటో డ్రైవర్లకు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుశీల నేత్రాలయ వైద్యుడు డాక్టర్ నాగార్జునతో పాటు రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ జెషాన్ అహ్మద్ పాల్గొని డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉన్న లోపాలను గుర్తించి తగిన సూచనలు, సలహాలతో పాటు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ప్రాణం విలువ తెలుసుకొని రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. రాత్రివేళల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయని, భారీ వాహనాల డ్రైవర్లు ఫోకస్ లైట్ల వాడకం వల్ల ఎదురుగా వచ్చే వాహనం డ్రైవర్లకు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఫోకస్ లైట్లకు బదులు మామూలు లైట్లు ఉపయోగించాలని భారీ వాహన డ్రైవర్లకు సూచించారు. దూర ప్రయాణం చేసేవారు అలసిపోయి రోడ్డు పక్కనే వాహనాలు నిలపడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు సైడు వాహనాలు పార్కు చేసేటప్పుడు రోడ్ సేఫ్టీ మెజర్స్ పాటించాలన్నారు. వాహనాలు ఓవర్ టేక్ చేసేటప్పుడు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనల గురించి ముద్రించిన కరపత్రాలను ఈ సందర్భంగా డ్రైవర్లకు పంపిణీ చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామంటూ వారి చేత ప్రతిజ్ఞ కూడా చేయించారు.

5 నుంచి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్: ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5,6 తేదీల్లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాల పోస్టర్లను సోమవారం రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర, సంస్కృతులు ప్రపంచానికే ఆదర్శమన్నారు. అలాంటి వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంబేడ్కర్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మధుకృష్ణ, నాయకులు యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి



బీఎల్వోల సమావేశంలో తహసీల్దార్ శేషఫణి

సి.బెళగల్: ఎన్నికల నిర్వహణపై అధికారులు, బీఎల్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శేషఫణి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణ, నియమావళి, పోలింగ్ కేంద్రల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. బీఎల్వోలు ఓటరు జాబితాను పకడ్బందీగా ఉంచుకోవడంతో పాటు, పోలింగ్ కేంద్రాలపై సమగ్ర సమాచారం కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, ఎన్నికల సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలను తమ పరిధిలోని సెక్టోరియల్ అధికారులకు తెలపాలని బీఎల్వోలకు సూచించారు. గ్రామాల్లో ఇంకా ఎవరైనా ఓటు హక్కుకు అర్హులై ఉంటే వారి నుంచి సరైన పత్రాలను స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏఎస్‌ఓ ఆదినారాయణ సూచించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సందీప్ మాట్లాడుతూ..ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బాధ్యతాయుతంగా పని చేయాలని, పోలింగ్ కేంద్రాల సమస్యలను మండల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చివరి దశకు చేరిన కుల గణన

కల్లూరు: అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన మండలంలో చివరి దశకు చేరిందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మండల పరిషత్ కార్యాలయం నుంచి కులగణన సర్వేను పర్యవేక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కల్లూరు గ్రామీణ ప్రాంతంలో 18 గ్రామ పంచాయతీలు, మజరాలతో కలిపి 25 గ్రామాలు ఉన్నాయన్నారు. మొత్తం 22,047 ఇళ్లు ఉండగా సోమవారం సాయంత్రనాటికి 20,089 ఇళ్లలో కులగణన సర్వే పూర్తయినట్లు తెలిపారు. మొత్తంగా 91.12 శాతంతో జిల్లాలోనే మొదటి స్థానం సాధించినట్లు చెప్పారు. ప్రజలు కులగణన సర్వేకు సహకరిస్తుడడంతోనే సర్వేను సకాలంలో పూర్తి చేస్తున్నామన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఓర్వకల్లు: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓర్వకల్లు ఎస్సీ కాలనీకి చెందిన గద్దల నవీన్‌కుమార్(32) కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామం, ఎస్సీ కాలనీలో నివాసముంటున్న గద్దల నాగమణి, ఇమ్మానుయేలు దంపతుల కుమారుడు గద్దల నవీన్‌కుమార్ అలియాస్ క్లింటన్ కొన్నేళ్లుగా స్థానిక గ్రామ పంచాయతీ బోర్డులో ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. అంతేకాక తనకున్న రెండు ఎకరాలతో పాటు, మరో రెండెకరాలను కౌలుకు తీసుకొని వర్షాధరం కింద పంటలు సాగు చేశాడు. కుటుంబ పోషణ, పెట్టుబడుల నిమిత్తం చేసిన అప్పులను తీర్చలేక మదనపడేవాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపానికిగురై ఈ నెల 26న తన పొలంలోనే పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యు లు చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు సంతానం.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుధాకర్

కల్లూరు: పరిశుభ్రమైన నీరు తాగాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ సూచించారు. సోమవారం కల్లూరు మండలం పెద్దటేకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తాగడానికి, వంటలు చేసుకోవడానికి నీరు ముఖ్యమైనదన్నారు. నీటిలో మంచి సూక్ష్మపోషకాలు ఉంటాయన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధి వలన దంతాల మీద అడ్డంగా పసుపు రంగు గీతలు ఏర్పడుతాయని, దంతాలు గోధుమ రంగులో మారి, చిగుళ్ల మధ్య నల్లగా ఉండి, చాక్ పీసు రంగులోకి మారుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సీఐడీ సీఐ శ్రీధర్

పాణ్యం: చెంచులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను వినియోగించుకొని న్యాయం పొందాలని కర్నూలు సీఐడీ సీఐ శ్రీధర్ అన్నారు. సోమవారం పాణ్యంలోని చెంచుకాలనీలోని ఆశ్రమ పాఠశాలలో చెంచులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెంచులు న్యాయం పొందేందుకు న్యాయస్థానాలు, పోలీసు స్టేషన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అనేక రకాల రాయితీలు కల్పిస్తున్నాయని, వాటిని ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గిరిజనులు తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలన్నారు.అనంతరం చెంచుల జీవన విధానాలు అడిగి తెలుసుకున్నారు. నాటుసారా తయారీ, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. రెవెన్యూశాఖ కు సంబంధించి గిరిజనులకు అందించే సేవలపై డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల పల్లవి, ఏఎస్ఐ నరసింహులు, సీఐడీ సిబ్బంది ఆంజినేయులు, ప్రిన్సిపాల్ సునందలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కోడుమూరు ఖోఖో జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు



ద్వితీయ స్థానంలో నిలిచిన మహిళల కబడ్డీ జట్టు

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెస్తున్నాయని కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. పోటీల్లో భాగంగా కోడుమూరులో వారం రోజుల పాటు జరిగిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మహిళలు, పురుషుల జట్లకు ఎంపీడీఓ చంద్రశేఖర్, సి.బెళగల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ రామాంజినేయులు సోమవారం సాయంత్రం స్థానిక బాలుర హైస్కూల్లో బహుమతులు, మెమోంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీసి ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. క్రీడల ద్వారా క్రీడాకారులకు మంచి గుర్తింపుతో పాటు శారీరక, మానసికోల్లాసం లభిస్తుందని చెప్పారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తైమూర్ బాషా, పీఈటీలు సురేంద్రనాయుడు, శ్రేయశ్రీ, క్రిష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీతో సంబంధం లేదు



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు డైరెక్టర్ రామకృష్ణారెడ్డి

కల్లూరు: పుసులూరు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీతో ఎలాంటి సంబంధం లేదని కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ (పుసులూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు) రామకృష్ణారెడ్డి తెలిపారు. పత్తికొండలో జరిగిన టీడీపీ సభలో ప్రభాకర్‌రెడ్డిని టీడీపీలో చేర్చుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం సాయంత్రం కల్లూరు అర్బన్ 26వ వార్డు న్యూ కృష్ణానగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అనుచరుడని ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పాణ్యం నియోజకవర్గం డీలిమిటేషన్ అయ్యాక 2009 నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యే కాటసాని తరుపున ఆయన ఎన్నడూ ఎన్నికల్లో ప్రచారం చేయలేదన్నారు. అతను పార్టీలో రావాలని ప్రయత్నిస్తే.. సొంత ప్రయోజనాలు ఆశించే వ్యక్తులకు పార్టీలో చోటు లేదని చేర్చుకోలేదన్నారు. టీడీపీ నాయకులు ఆ పార్టీకి చెందిన వ్యక్తినే మళ్లీ చేర్చుకొని ప్రచారం చేస్తున్నారన్నారు. ఆయన పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులకు వైపు నిలిచాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యంరెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత శరీన్‌నగర్



వాలీబాల్ పోటీలలో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మండల కేంద్రమైన ఓర్వకల్లు జెడ్పీహై స్కూల్ మైదానంలో ఈ నెల 23 నుంచి ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో కల్లూరు మండలం, శరీన్‌నగర్ జట్టు ప్రథమ విజేతగా నిలిచినట్లు ఫిజికల్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. రెండో స్థానంలో ఉల్లిందకొండ, మూడో స్థానంలో నన్నూరు-2 సచివాలయాల జట్లు నిలిచాయన్నారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో కర్నూలు జట్టు ప్రథమ స్థానం, పాణ్యం-3 జట్టు ద్వితీయ స్థానం, లక్ష్మిపురం జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. మహిళల విభాగంలో ఎఫ్‌సీఐ కాలనీ జట్టు ప్రథమ స్థానం, కన్నమడకల జట్టు రెండో స్థానం, వీకర్‌సెక్షన్ కాలనీ జట్టు మూడోస్థానం సాధించాయని చెప్పారు. విజేతలైన జట్లకు ఎంఈఓ ఓంకార్‌యాదవ్ బహుమతులను ప్రదానం చేశారు.

నేడు హుసేనాపురంలో పట్టాల పంపిణీ

ఓర్వకల్లు : మండలంలోని హుసేనాపురం గ్రామంలో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు జీకే వెంగన్న సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చొరవతో గ్రామంలో రెండు విడతల్లో కలిపి అర్హులైన సుమారు 550 మందికి పట్టాలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పట్టాలను ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

పాణ్యం : ఇటీవల ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహంలో ప్రసవించి మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నేతలు రాజునాయుడు, ఓబులేసు, జయరాజ్, రియాజ్, నవీన్ డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. కళాశాల యాజమాన్యం పూర్తి బాధ్యత తీసుకొని విద్యార్థిని కుటుంబానికి రూ.20లక్షలు చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం కళాశాల సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. నిరసనలో ప్రతాప్, వెంకటాద్రి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.